నేడు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల స్వీకరణ

మూసాపేట: మూసాపేట సర్కిల్ పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకానికి సోమవారం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవుగా ప్రకటించినా ఆయా డివిజన్లలోని కేంద్రాల వద్ద రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఇప్పటి వరకు మూసాపేట సర్కిల్ పరిధిలో సుమారు 1006 దరఖాస్తులు అందియని వారు వివరించారు.

ప్రినేటల్ కేర్ అవసరం



సాక్షి, సిటీబ్యూరో: తల్లి గర్భంలో ఉండగానే పిండం ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుందుకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలంగాణ వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిష్టినా అన్నారు. ఆదివారం కూకట్‌పల్లిలోని వివేరా ఫీటల్ మెడిసిన్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ ప్రయోజనాల కోసం సాధ్యమైనంత ఉత్తమమైన ప్రినేటల్ కేర్‌ను అందించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య శాస్త్రంలో ఫీటల్ మెడిసిన్ అనేది కొత్త విభాగమని, పిండ దశలోనే అనారోగ్య సమస్యలను పరిశీలించి, చికిత్సలు చేయడానికి వీలుంటుందని వివరించారు. ఆరోగ్యకరమైన శిశువుకు జన్మనివ్వడానికి ఫీటల్ మెడిసిన్ ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు చిన్మయి రాథే, ప్రనీతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఉచిత యోగా శిక్షణా శిబిరం ప్రారంభం



యోగా శిబిరంలో పాల్గొన్న కాలనీ వాసులు

అల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్యనగర్ కమిటి హాల్‌లో ఆదివారం భారతీయ యోగా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణా శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జీవా గురుకులం, సమతానగర్ ప్రిన్సిపాల్ కె. ఉమావతి, అతిథులు డా. శేషగిరిరావు, ఆదిత్య నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె. వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కె. రాంబాబు, భారతీయ యోగా సంస్థాన్ సెక్రటరి కె. జ్యోతి, సెంటర్ ఇన్‌చార్జి డి. వసుంధరా దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ సబీహా బేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్, గాయత్రి నగర్‌లో మంజు హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాయత్రినగర్‌లోని ఉచిత వైద్య శిబిరాలను అల్లాపూర్ డివిజన్ ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు సరిత, గీత, అశ్విన్, సురేష్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్, చైర్మన్ శేషయ్య, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ శ్రీనివాస్ రెడ్డి, రజాక్, శివకుమార్‌గౌడ్, బాబీ, తదితరులు పాల్గొన్నారు.

సగర సంఘం కార్యాలయం ప్రారంభం

రాయదుర్గం: సగర సంఘానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ పార్టీ అధికారి ప్రతినిధి, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ దినేష్‌చౌదరి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో ఆదివారం సగర సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సంఘటితంగా ముందుకుసాగాలన్నారు. అనంతరం కార్యాలయానికి అవసరమైన వసతులతోపాటు ఫర్నీచర్ అందించిన వారిని సత్కరించి షీల్డ్‌లను అందించారు. కార్యక్రమంలో రాయదుర్గం సగర సంఘం అధ్యక్షుడు బాలరాజుసాగర్, ఉపాధ్యక్షుడు డిండి పరంధాములు, రాము,నవీన్, శాంతన్, సాయి వేణు, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు పూర్తి

• పలు ప్రాంతాల్లో భారీ ఏర్పాట్లు • అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేసిన బీజేపీ నాయకులు



బాలానగర్ జాతీయ రహదారిపై అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, తదితరులు



మోతీనగర్ చౌరస్తాలో..

కూకట్‌పల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో బాలానగర్‌లోని జాతీయ రహదారిపై ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని నీటితో కడిగి శుభ్రం చేశారు. సోమవారం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు రమేష్, డివిజన్ అధ్యక్షులు డాక్టర్ కిరణ్‌కుమార్, మహిళా మోర్చా నాయకులు రూప, డివిజన్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మోతీనగర్ చౌరస్తాలో...

మోతీనగర్ చౌరస్తాలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ పాలతో, నీటితో శుభ్రం చేసి జయంతి వేడుకలకు సిద్ధం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎర్రస్వామి, రాష్ట్ర బీజేపీ లీగల్ సెల్ సభ్యులు సద్గుణ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ చారి, నాయకులు మల్లేష్‌గౌడ్, నాగరాజు, శోభ రాజన్, రమేష్ నాయర్, డివిజన్ ఉపాధ్యక్షురాలు హేమలత,ఎస్సీ మోర్చా డివిజన్ అధ్యక్షులు దర్శనం పావని, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులకు అండగా ఉంటా

ఆల్విన్‌కాలనీ: ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులకు అండగా ఉంటానని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం ఆయన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, సంఘం వ్యవస్థాపకులు గంధం రాములుతో కలిసి వివేకానందనగర్ కాలనీలో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం గత 15 ఏళ్లుగా కృషి చేస్తున్న తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం రాష్ట్ర కమిటీ 2025 డైరీని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ప్రైవేట్ టీచర్లు, ఐటి ఉద్యోగులకు అన్ని విధాల అండగా ఉంటామన్నారు. వారికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంఘం ఐటీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు కట్ట రవికుమార్ గుప్త, మీడియా విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర యాకయ్య, ప్రైవేట్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు పి.వై. రమేష్, మున్సిపల్ కార్మికుల విభాగం అధ్యక్షులు గ్యార శ్రీనివాస్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు శ్రావణి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పుష్ప మన్యం, నాయకులు సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత రావు, అంబాల మహేష్ కుమార్ గౌడ్, విఠల్‌ముదిరాజ్, లింగయ్య, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ ముదిరాజ్, ఆనందరావు, అంజలి తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

అన్నదానం మహాదానం



అన్నదానం చేస్తున్న మస్తాన్ రెడ్డి, తదితరులు

మోతీనగర్: ఆకలితో అలమటిస్తున్న అభాగ్యులు, అనాథలకు పట్టెడన్నం పెట్టడంతోనే జీవితానికి సంతృప్తి లభిస్తుందని వీటీం వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరెంటి మస్తాన్ రెడ్డి అన్నారు. ఆదివారం విటీం జాయింట్ సెక్రటరి రాగోలు సత్యనారాయణ కుమారుడు తనవ్ పుట్టిన రోజు సందర్భంగా బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సంపాదించిన దానిలో కొంతైనా పేదల కోసం వెచ్చించాలన్నారు. కార్యక్రమంలో వీటీం కోశాధికారి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చాలనుకోవడం దారుణం



ర్యాలీలో పాల్గొన్న బండి రమేష్ తదితరులు

మోతీనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తోందని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం అల్లాపూర్ డివిజన్‌లో జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ రాజ్యాంగ మూల సూత్రాన్ని మార్చాలని అనుకోవడం అవివేకమన్నారు. లోక్‌సభలో గాంధీజీ, అంబేడ్కర్‌పై అమిత్‌షా మాటలు అనైతికమన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలన్న బీజేపీ తీరును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నదన్నారు. రాజ్యాంగాన్ని మార్చడానికి కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోదన్నారు. కార్యక్రమంలో కార్యక్రమం కోఆర్డినేటర్ ఉజ్మా షాకీర్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, విఠల్ రెడ్డి, జమీర్, డివిజన్ అధ్యక్షుడు మొయినుద్దీన్, మస్తాన్ రెడ్డి, బర్కత్‌అలీ, నరసింహ, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రోమోరన్ విజయవంతం



ప్రోమోరన్‌లో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు రమేష్, శ్రీనివాస్ రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: ఇగ్నైట్ విద్యాసంస్థలు, అవంతిక కన్‌స్ట్రక్షన్స్ ఆదివారం సంయుక్తంగా చేపట్టిన 5కే, 10కే ప్రోమోరన్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా సంస్థల అధినేతలు రమేష్, శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 20న సేవా దృక్పథంతో నిర్వహించనున్న ఈ రన్‌లో ప్రతి ఒక్కరు పాల్గొని దీనులకు తమ వంతు సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన విరాళాలను కూకట్‌పల్లిలోని ఆకార్ ఆశ ఫౌండేషన్‌కు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రన్నర్స్ తరుపున జగన్మోహన్‌రెడ్డి, నరేష్, ప్రైమ్ 9 ప్రతినిధి కిశోర్, ఇగ్నైట్ విద్యాసంస్థలు, అవంతిక కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చలో జలవిహార్‌కు తరలివెళ్లిన మహిళా నేతలు

అల్విన్‌కాలనీ: రాష్ట్రంలో మున్నూరు కాపులను జనాభాను తక్కువగా చూపించినందున మే నెలలో నిర్వహించనున్న మున్నూరు కాపు సింహ గర్జనకు సంబంధించి ఆదివారం మున్నూరు కాపు నాయకులు జలవిహార్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి జగద్గిరిగుట్ట నుంచి మున్నూరు కాపు మహిళా సంఘం, మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షురాలు పర్వత సంధ్యారాణి పటేల్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు తరలి వెళ్లారు. శేవారిలో కొట్టే అరుణ పటేల్, పీలం మమతా పటేల్, కమటం పద్మ సుజాత, పడాల మంజుల పటేల్, పిల్లి శ్వేతా పటేల్, సుంకరి నాగరాణి పటేల్, పడాల హారిక పటేల్, పర్వత నిఖిల, మానస పటేల్, పడాల ప్రియాంక పటేల్ తదితరులు ఉన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం...



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మూసాపేటలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో సమావేశమయ్యారు. 2007–2008 సంవత్సరం పదవ తరగతి చదివిన వీరు ఆనాటి ఉపాధ్యాయులతో కలిసి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ విద్యార్థులు ఇంకా మంచి స్థాయికి చేరుకొని, కుటుంబంతో సంతోషంగా ఉండాలని ఉపాధ్యాయులు దీవించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులకు మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్, వైస్ చైర్మన్ అనిత, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ప్రసాద్, సంతోష్, శాలిని, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



స్నేహపురి కాలనీలో పర్యటిస్తున్న తూము శ్రావణ్‌కుమార్

మోతీనగర్: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. నాలా పొడవునా స్లాబ్ పనులు పూర్తి అయినందున విద్యుత్ స్తంబాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. స్నేహపురి కాలనీ మెయిన్‌రోడ్డుతో పాటు, అంతర్గతంగా ఉన్న రోడ్లకు నాలా స్లాబ్ ఎత్తుగా ఉన్నందున వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, నాలా స్లాబ్‌తో రోడ్లను అనుసంధానం చేయాలని కోరారు. దీనిపై స్పందిస్తూ సమస్యలను ఎమ్మెల్యే కృష్ణారావు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సి.హెచ్. సత్యనారాయణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి తిరుపతి, కాలనీ అధ్యక్షుడు వినోద్, వెంకటేశ్వర్ రెడ్డి, చలమారెడ్డి, రమేష్, మోహన్ రెడ్డి, జేవి. ప్రసాద్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

రాయదుర్గం: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా కోరారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఏర్పడి 25 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో చలో వరంగల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్ సెంటర్ ప్రారంభం

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గం మల్కంచెరువు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఓ ఆర్థోపెడిక్ సెంటర్, సెరమ్ లక్స్ స్కిన్ కేర్ సెంటర్లను పలువురు ప్రముఖులు ప్రారంభించారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు పాల్గొని ఆస్పత్రి నిర్వాహకులను అభినందించారు.

గోపన్‌పల్లి చెరువులో చేపలు మృత్యువాత

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని చిన్నాపెద్ద చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. దీంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు చెరువులను సుందరీకరణ, మురుగు నీరు చేరకుండా చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రకటిస్తున్నా, మరోవైపు చేపలు పెద్ద సంఖ్యలో మృతి చెందడం ఆందోళనకు గురిచేస్తోంది. చెరువులోకి మురుగునీరు పెద్ద ఎత్తున చేరుతున్నందునే ఈ సమస్య తలెత్తుతోందని చెరువలోని బ్రిక్స్ స్కైవుడ్ అపార్ట్‌మెంట్‌కు చెందిన పివిరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చెరువులోకి మురుగునీరు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నాట్యశోభితం



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం పద్మశ్రీ శోభానాయుడు శిష్యబృందం నాట్యోభితం నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్నారు. పీబీ కృష్ణభారతి, బసవ లావణ్య, ఉషాకిరణ్, ఉషా గోటేటి గురువుల శిష్యబృందాలు పాల్గొన్నారు. ప్రముఖ నాట్య గురువులు పద్మశ్రీ పద్మజారెడ్డి, డాక్టర్ రమాదేవి కళాకారులను అభినందించారు. శ్వేతాప్రసాద్, జయకుమార ఆచార్యలను సురభి రఘునాథ్ సత్కరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మియాపూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ జేపీయన్ కాలనీలో సత్యనారాయణ (62) కుటుంబం నివసిస్తోంది. పని నిమిత్తం శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్లాడు. స్టాలిన్‌నగర్‌వైపు నుంచి జేపీఎన్ నగర్ వైపు వస్తుండగా ప్రశాంత్‌నగర్ కాలనీ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. సత్యనారాయణ కింద పడగా తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి అల్లుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మిత్ర హిల్స్‌లో వీధి దీపాల సమస్య పరిష్కారం



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

మోతీనగర్: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని మిత్ర హిల్స్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆదివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ సిబ్బంది, కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు కాలనీలో వీధి దీపాలు పని చేయటం లేదని దీంతో దొంగతనాలు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని చెప్పటంతో తక్షణమే స్పందించి వీధి లైట్లను మార్పించారు. కాలనీ వాసుల నుంచి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు సుధాకర్, కాళి, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్




ప్లేస్‌మెంట్‌లో ఎన్నికైన హర్ష, చందన

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె. సురేష్ బాబు ఆధ్వర్యంలో పలు కోర్ కంపెనీల్లో ఉద్యోగ కల్పనలో భాగంగా ఆదివారం రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ టెక్నికల్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కోర్ కంపెనీల నియామకానికి ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈఈఈ ఎంటెక్ విద్యార్థులైన తిరుక్కోవల్లూరు హర్ష, జోరుసిరి చందన అనే విద్యార్థులు ఎల్ అండ్‌టీ, టిటాఘర్ ఫైర్మ కంపెనీల్లో ఎన్నికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పలువురు విద్యార్థులు, ఉద్యోగులు అభినందించారు.

'అను'రాగాలు కథల సంపుటి ఆవిష్కరణ



'అను'రాగాలు కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు

మోతీనగర్: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, శ్రీ సాంస్కృతిక కళాసారధి, సింగపూర్, వంశీ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాజ గాన సభలో ఉగాది సాహిత్య సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రినగర్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి అనురాధ రచించిన 'అను'రాగాలు కథల సంపుటిని జననీ కృష్ణ, బొల్లినేని కృష్ణయ్య, విక్రమ్ సేన్, వంశీ రామరాజు, రాధిక మంగినపూడి, సుంకర శైలజ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత యలమర్తి అనురాధ 'శివ ప్రభోధం' అనే కవిత చదివి అందరి ప్రశంసలు అందుకున్నారు.

బీసీలకు రాజ్యాధికారం దక్కాలి



ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారం దక్కాలని ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న అన్నారు. ఈ మేరకు ఆదివారం బీసీ పొలిటికల్ జేఏసీ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సుదగాని హరి శంకర్ గౌడ్ తదితరులు తీన్మార్ మల్లన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రి ఎన్నుకునేందుకు బీసీ యువత ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో రాంబాబు, రవిరాజ్, సాయిరామ్, సందీప్, సీత, శ్రావణ్, రంజిత్ తదితరులు ఉన్నారు.

పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటా..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, ప్రశాంత్‌నగర్‌లోని రాజస్థాన్‌కు చెందిన చిన్న తరహా పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ట్యాక్స్ విపరీతంగా పెంచిందని, మున్సిపల్ ట్యాక్స్‌ను మూడు రెట్లు అధికంగా పెంచారని, అదేమిటని అధికారులను ప్రశ్నిస్తే లంచాలు అడుగుతున్నారని వారు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు.దీంతో ఆయన ఆదివారం ప్రశాంత్‌నగర్‌లోని ఇండస్ట్రియల్ ప్రాంతంలోని పరిశ్రమల వద్దకు వెళ్లి ధైర్యం చెప్పారు. ఇక్కడున్న వారంతా తెలంగాణ ప్రాంతానికి చెందిన వారేనని, వారి సమస్యలపై పోరాడతానని మీకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అన్ని విభాగాల అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, చిన్న తరహా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.




చిన్నతరహా పారిశ్రామిక వేత్తలకు ధైర్యం చెబుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు